క్లుప్తంగా

కుటిల రాజకీయాల కూటమిని ఓడిద్దాం


వెంకటరమణ

చిట్వేలి : రాష్ట్రంలో కుటిల రాజకీయాలు చేస్తున్న కూటమిని ఓడించాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మలిశెట్టి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి సారథిగా దేశంలో పేరొందిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 2014లో గెలిచిన చంద్రబాబు కూటమి అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేయడంతో 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. జగనన్న సీఎం అయ్యాక పేదల ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని విజ్ఞప్తి చేశారు.

సాయుధ బలగాలతో పోలీసు కవాతు


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

రామాపురం : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని లక్కిరెడ్డిపల్లె సీఐ గంగనాధబాబు కోరారు. మండల కేంద్రంలోని వీధులు, కల్పనాయునిచెరువు, సుద్దమళ్ల పంచాయతీలోని యర్రంరెడ్డిగారిపల్లె, బయారెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లె పంచాయతీలో కొత్తపల్లి, చిట్లూరు గ్రామంలో 60 మంది కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది శుక్రవారం కవాతు నిర్వహించారు. ప్రజలకు శాంతి భద్రతలపై వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలింగ్ అద్దాల పంపిణీ


పోలీసులకు కూలింగ్ అద్దాలు అందజేస్తున్న సీఐ, లయన్స్‌క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా పోలీసులకు కూలింగ్ అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సాయి కంటి ఆసుపత్రి ప్రొప్రయిటర్ శ్రీకాంత్‌రెడ్డి దాతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్‌సభ్యులు మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున బ్లూకోట్ పోలీసులకు ఇబ్బంది కలగకుండా కూలింగ్ అద్దాలను అందజేస్తున్నట్లు చెప్పారు. అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు హరినాథరెడ్డి, మహమ్మద్, నాగార్జున ఆచారి, కోశాధికారి హరీష్‌చంద్ర, సభ్యులు శివారెడ్డి, రత్నమాచారి, సాయికంటి ఆసుపత్రి ప్రొప్రయిటర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూలంగిసేవ

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు శ్రీగట్టు వెంకటరమణస్వామి తిరునాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి పూలంగిసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం భక్తుల గోవిందనామస్మరణలతో మారుమోగింది.

ముదివేడు తిరునాలకు ఏర్పాట్లు

కురబలకోట: పడమటి మండలాల్లో ప్రసిద్ధి చెందిన ముదివేడు దండు మారెమ్మ తిరునాలకు పటిష్ట ఏర్పట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి, ఆదివారం పగలు తిరునాల ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల వారు తరలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ముదివేడుతో పాటు మట్లివారిపల్లె, దాదంవారిపల్లె, కడప క్రాస్, వనమరెడ్డిగారిపల్లె, పిచ్చలవాండ్లపల్లె గ్రామాలకు కూడా ముఖ్యమైన దేవతగా అనాదిగా పూజలందుకుంటోంది. ఎన్నికల నేపథ్యంలో తిరునాల నిర్వహణకు మదనపల్లె డీఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ముదివేడు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. గ్రామ సర్పంచ్ షహనాజ్ బేగం, నాయకులు ఎం. ఫిరోజ్‌ఖాన్, ఎం. అంజాద్ ఖాన్ గుడి వద్ద పరిసరాలను జేసీబీతో శుభ్రం చేయించారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం


రైల్వేకోడూరు : ప్రత్యేక ప్రార్థనల్లో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


నందలూరులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రాజంపేట క్లస్టర్ పరిధిలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రైల్వేకోడూరు లూథరన్ చర్చిలో జరిగిన వేడుకలలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని, ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పించే ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని తెలిపారు. క్రీస్తు అనుసరించిన శాంతిమార్గం, ప్రపంచ శాంతి కోసం ప్రభువు మానవాళికి అందించిన సందేశం గురించి తెలియజేశారు. ఏసు మంచితనాన్ని, త్యాగనిరతిని చాటి చెప్పేందుకే ఈ రోజును గుడ్‌ఫ్రైడేగా పిలవడం జరుగుతుందన్నారు. చర్చిలో క్రైస్తవులు ఏసు గీతాలను ఆలపిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, సిద్దయ్య, కొరముట్ల శేఖర్, అంజి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని చక్రంపేట కర్మేల్ ప్రార్థనా మందిరంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చక్రంపేట, పెనగలూరు, సిద్దవరం, తిరుణంపల్లె, కొండూరు, వినాయకనగర్ గ్రామాలలో ఉన్న చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. కొండూరు చర్చికి నూతనంగా వచ్చిన పాస్టర్ శివలింగం ప్రత్యేకంగా ప్రార్థన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లి ఆర్ ఎస్ రోడ్డులోని పునీత జోజప్ప చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువు ఈరి బాలస్వామి ప్రసంగిస్తూ సర్వలోక పాప పరిహారనార్థం ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో తన ప్రాణం అర్పించారని వివరించారు. ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తం ద్వారా సర్వ మానవాళికి రక్షణ లభించిందన్నారు. అనంతరం ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలను గుర్తు చేసుకుంటూ వేషధారణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు నరేంద్ర, ప్రకాష్‌రెడ్డి, శౌరి, భాస్కర్, బాబు, జోసెఫ్, జైపాల్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల పరిధి కడప–చెన్నై జాతీయ ప్రధాన రహదారిలోని చాముండేశ్వరిపేట గ్రామ సమీపంలో ఉన్న నిష్కళంక మాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ రెవరెండ్ లారెన్స్ మాట్లాడుతూ మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ఏసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజును గుడ్‌ఫ్రైడేగా పిలుస్తున్నట్లు తెలిపారు. ఏసుప్రభువు సిలువపై ప్రాణత్యాగం చేసినందున దానిని స్మరించుకుంటూ తాము కూడా అందులో భాగస్వాములమై నిష్కళంక మాత చర్చి వద్ద నుంచి కడప–చెన్నై రహదారిలో సిలువ యాగం చేస్తూ ప్రార్థనలు చేసుకుంటు నడిచామన్నారు. సిలువపై ఏసుక్రీస్తు చెప్పిన 7 ప్రవచనాలను క్రైస్తవులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో శాకారజుపల్లి సర్పంచ్ శ్రీకాంత్, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : రాయచోటిలోని సెయింట్ పాల్స్ లూథరన్ సంఘం చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రెవరెండ్ ఎస్ఎస్‌జీ శుభకర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సాధారణ మనిషిగా భూమి మీద జన్మించి ప్రజలను చెడు నుంచి మంచి వైపు నడిపించడం కోసం శ్రమించారన్నారు. ప్రార్థనల్లో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చి, మిస్బా చర్చి, మద్దిరేవుల చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ విజయ్‌మోహన్‌రెడ్డి ఏసుక్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. ఈ నెల అంతా ఉపవాసాలు చేసిన క్రైస్తవులు ఈ రోజు ప్రార్థనలు చేసి ఉపవాసాలు ముగిస్తారని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాజంపేట టౌన్ : ప్రభువైన ఏసుక్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేసి మానవలోకానికి రక్షకుడిగా మారారని పాస్టర్లు తెలిపారు. నియోజవర్గ వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు, విశ్వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిల పాస్టర్లు ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. తనను హింసిస్తున్న వారిని కూడా క్షమించాలని తన తండ్రి అయిన దేవుడిని ప్రార్థించి క్రీస్తు లోకానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో ఆయా పాస్టర్లు ప్రేమవిందును ఏర్పాటు చేశారు.


సిద్దవటం : సిలువ యాగం ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు


రాయచోటి టౌన్ : ప్రసంగిస్తున్న ఫాదర్ ఎస్ఎస్‌జీ శుభకర్


రాజంపేట టౌన్ : ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

సింగిల్ విండో మాజీ అధ్యక్షుడికి పరామర్శ


కృష్టారెడ్డిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు టంగుటూరు కృష్టారెడ్డిని గాడివారిపల్లెలోని ఆయన స్వగృహంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం పరామర్శించారు. కృష్టారెడ్డి ఇటీవల తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయన యోగక్షేమాలను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ యువకులు ప్రభుత్వ విప్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, సర్పంచ్‌లు జరుగునారాయణరెడ్డి, పోలిపాపిరెడ్డి, ఉప సర్పంచ్ రూపేష్ కుమార్‌రెడ్డి, బండారు రమణ, రఘురామరాజు, వెంకటసుబ్బయ్య, పసుపులేటి సుబ్బరాయుడు, బాలాజీ, శ్రీనివాసులు, మారే సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశం కోసం ఏప్రిల్ 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ వరకు ఉన్న గడువును ఏప్రిల్ 6 వరకు పొడిగించారని, కావున ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్, ఆంగ్ల మాధ్యమంలో బోధనా విధానం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తామని, కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుల్లంపేట : పుల్లంపేటలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశం కోసం ఏప్రిల్ 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేది వరకు ఉన్న గడువును ఏప్రిల్ 6వ తేది వరకు పొడిగించారని, కావున ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరకాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలి


బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందలూరు(రాజంపేట) : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని, ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, రాజంపేట డీఎస్పీ చైతన్యల ఆదేశాల మేరకు ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో టంగుటూరు, పొత్తపి గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అందరూ పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. మండలంలో ఎటువంటి ఘర్షణలు జరిగినా కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగటానికి సహకరించాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ : పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.ఓబులేసు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఉచిత శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఉచిత శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషులో ఉన్న స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆసిఫ్‌అలీఖాన్‌కు కన్నీటి వీడ్కోలు


ఆసిఫ్ అలీఖాన్ అంతిమయాత్ర ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

- అంతియ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత, రాయచోటి మున్సిపాలిటీ 30వ వార్డు కౌన్సిలర్, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం మరిది ఆసిఫ్‌అలీఖాన్ అంత్యక్రియాలు శుక్రవారం ముగిశాయి. పార్టీ నేతలు, కార్యకర్తలు, బంధువులు అశ్రుతనయనాల మధ్య ఆసిఫ్ అలీఖాన్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. అంత్యక్రియల్లో పార్టీ నేతలతో కలసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఆసిఫ్‌అలీఖాన్ అంతిమయాత్ర పట్టణంలోని బిరాంసాహెబ్ వీధిలోని నివాసం నుంచి ఠాణా సమీపంలో చున్నామసీదు వరకు, అక్కాడ నుంచి పెంటమసీదు వరకు సాగింది. యాత్రలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి ఆసిఫ్ అలీఖాన్ పాడెమోశారు.

ఆసిఫ్ మృతి పార్టీకి తీరనిలోటు

ఆసిఫ్‌అలీఖాన్ మృతి ఎంతో బాధాకరమని, వైఎస్ఆర్‌సీపీకి తీరని లోటు అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రజల మన్ననలు పొంది సౌమ్యుడిగా ఆసిఫ్ పేరొందరన్నారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్‌రహిమాన్, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, సీనియర్ మైనార్టీ నేతలు జమాల్‌ఖాన్, అలీనవాజ్‌ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, బేపారి మహమ్మద్‌ఖాన్, హబీబుల్లాఖాన్, డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, రియాజుర్, రియాజ్, రిజ్వాన్, కొలిమి హారూన్, సాదక్ అలీ, జానం రవీంద్ర, సుగవాసి ఈశ్వర్, శ్యామ్, అల్తాఫ్, రౌనఖ్, ఫయాజ్ అహమ్మద్, జాకీర్, ఇర్ఫాన్, హసన్ బాషాతో పాటు పెద్ద ఎత్తున వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ‘ఆకేపాటి’ లోకల్

- అమరనాథ్‌రెడ్డి తనయుడు భరత్‌రెడ్డి ప్రచారం


రాజంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఆకేపాటి భరత్‌రెడ్డి

రాజంపేట : నియోజకవర్గ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి లోకల్ అని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆకేపాటి భరత్‌రెడ్డి అన్నారు. రాజంపేట మున్సిపాలిటీలో ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తనయుడు ఆకేపాటి భరత్‌రెడ్డి శుక్రవారం 10, 11 వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాన్నను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత కొన్ని రోజులుగా పట్టణంలో భరత్‌రెడ్డి ముమ్మరంగా నిర్వహిస్తున్న ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. ప్రచార పర్వంలో భాగంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థిగా నాన్‌లోకల్ వ్యక్తికి టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు చేసే సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. పేదల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డికి ఓటు వేసి, వేయించి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి మురళీరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, వైఎస్సార్‌సీపీ నేతలు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, పాపినేని విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, మాలమహానాడు నేత కొమ్మా ఎల్లయ్య, నాయకులు హుసేన్, బొజ్జాపెంచలయ్య, ఉదయ్, సొంబెత్తిన శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ మృతి పార్టీకి తీరని లోటు


రమేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : మండల కేంద్రంలోని పావని సర్కిల్ వద్ద గల గాండ్ల రమేష్(55) ఆకస్మిక మరణం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో రమేష్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని స్వగృహానికి తెచ్చారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అక్కడికి చేరుకుని రమేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షులు, పార్టీ కన్వీనర్ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, టి. వేణుగోపాల్, టి.పెద్ద రమణ, టి.చిన్నరమణ, టి.సుబ్బయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు గంగాధర్‌నాయుడు, శ్రీనివాసులు, బీసీ నాయకులు చెంద్రాయుడు, కె.వెంకటయ్య, నర్సరీ నాగేశ్వర్, సూరీ, వెంకటరమణ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి


మామిడి దిగుబడిని పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రామాపురం : ప్రస్తుత వేసవి సీజన్‌లో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి తోటలను పరిశీలించారు. కేవలం 10 శాతం కూడా కోతలు కనిపించడం లేదని, చెట్లకు మామిడి కాయలు కూడా కనిపించడం లేదన్నారు. 2021–22 సంవత్సరంలో తీవ్రమైన కరోనాతో దిగుబడి తీసుకెళ్లేందుకు వ్యాపారస్తులు రాకపోవడంతో చెట్ల మీదనే వదిలేయడం జరిగిందని తెలిపారు. 2023లో అరకొర పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో దిగుబడి కూడా నేలమట్టమైందన్నారు. ఈ ఏడాది ఏ తోటలో చూసినా కాపు కనిపించడం లేదన్నారు. ఉపాధి హామీ పనులను మామిడి రైతులకు ఉపయోగపడేలా అనుసంధానం చేయాలని కోరారు. మామిడి తోటలు ఎండిపోకుండా రైతులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పట్టాభిరెడ్డి, రామాంజల్‌రెడ్డి, వెంకటమల్లప్పనాయుడు, సుబ్బయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

దండు మారెమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: కురబలకోట మండలం ముదివేడు దండు మారెమ్మ జాతరకు శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె–ముదివేడు మధ్య 20 బస్సులు, ముదివేడు– కోసువారిపల్లె మధ్య ఒక బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. కదిరి తేరు పుస్కరించుకుని శనివారం ఐదు బస్సులు అదనపంగా నడపడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.


ఘనంగా శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : కొర్లకుంట గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను శుక్రవారం వేద పండితులు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం మూలమంత్ర, నవగ్రహ జపాలు, అభిషేకం, అర్చన, దీక్షాహోమం, పారాయణం, మహానైవేద్యం, మహా మంగళహారతి, అష్టోత్తర శతదీపాలంకరణ, వేదపారాయణం, నైవేద్యం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ధ్వజస్తంభానికి నమస్కరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం పూజారులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీటీసీ వత్తలూరు రోహిణీ కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌కుమార్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, గ్రామస్తులు అంకన్నగారి ఎల్లారెడ్డి, అంకన్నగారి వేణుగోపాల్‌రెడ్డి, అంకన్నగారి లక్ష్మీకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కా చెంగల్‌రెడ్డి, ముక్కా రవీంద్రరెడ్డి, పాపన్నగారి కృష్టారెడ్డి, సిద్దారెడ్డి, విజయ్ గోపాల్‌రెడ్డి, వీపీ వెంకటరెడ్డి, వీపీ రామచంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

- దుద్యాల రోడ్ల నిర్మాణాల్లో రాజకీయం తగదు
- టీడీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి ఆరోపణలకు ఖండన
- వైఎస్సార్‌సీపీ నాయకులు


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి


వైస్ ఎంపీపీ భాగ్యమ్మ

సంబేపల్లె : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని మండల జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్డి వెంకటరమణారెడ్డి, సంబేపల్లె వైస్ ఎంపీపీ మీసాల భాగ్యమ్మ అన్నారు. మండలంలోని దుద్యాల గ్రామం పెద్దకోడివాండ్లపల్లి రోడ్డు నిర్మాణ పనులలో మీ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వారి కనుసన్నల్లో కాంట్రాక్టు పనులు చేసుకొని, బిల్లులు మీ వారే పొందిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ రోడ్డు పనులు ఎవరు చేశారని తెలుసుకోకుండా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనే గ్రామంలోనే 26 తాగునీటి బోర్లు వేసి, వీలైనంత వరకు తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. మీ మద్దతుదారులు పంచాయతీ తీర్మానం ఇవ్వకపోవడంతో ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోత్రెడ్డిగారిపల్లె, మహమ్మద్ నగర్‌లలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిల కృషితో మంజూరైతే పంచాయతీ తీర్మానం పేరుతో అడ్డుకున్నది ఎవరని ప్రశ్నించారు.

ఎన్ఆర్ఈజీఎస్, గడప గడపకు మన ప్రభుత్వం పనులకు పంచాయతీ తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపడి గ్రామ అభివృద్ధికి ఆటంకం కల్గించింది మీ మద్దతుదారులు కాదా? అలాంటి వ్యక్తులను మీ పక్కలో పెట్టుకుని మీరు మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నాలుగేళ్ల క్రితం ఐదు తాగునీటి బోర్లు, ఒక మోటార్ ఏర్పాటు చేశామని, ఇంత వరకు తాము బిల్లులు కూడా పొందలేదన్నారు. మీ చుట్టూ ఉన్న టీడీపీ నాయకులు ఏది చెబితే, అదే నిజమని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సొంత నిధులతో కొట్రాళ్లపల్లెకు రోడ్డు వేయించి దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించిన విషయం మీకు, మీ పార్టీ వారికి తెలియదా అన్నారు. మీ చుట్టూ ఉండే టీడీపీ నాయకులు ఏ నాయకుడైనా ఐదు లక్షల రూపాయల వరకు తన సొంత నిధులు గ్రామంపైన వెచ్చించి ఉన్నారేమో ఒకసారి అడుగు, ప్రజలందరూ గమనిస్తున్నారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. జగనన్న పాలనలో దుద్యాల గ్రామంలో కుల, మత, పార్టీలు చూడకుండా దాదాపు 200 మందికి పక్కా గృహాలు మంజూరు అయ్యాయన్నారు. ఇందుకు టీడీపీ వారికి కూడా పక్కా గృహాలు అందాయన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ద్వారా దుద్యాల గ్రామ ప్రజలకు సుమారు రూ.18 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలకు దుద్యాల గ్రామంలో అత్యధిక మెజారిటీ సాధించి తీరుతామని వారు ధీమా వ్యక్తం చేశారు.